
సాక్షి మంచిర్యాల

ఆదివారం । 19 । జనవరి । 2025



'కంకాలమ్మ'కు ఏర్పాట్లు పూర్తి

జన్నారం మండలంలో పొనకల్ పరిసర అటవీప్రాంతంలో గుట్టపైన కొలువుదీరిన కంకాలమ్మ, కేతేశ్వర శివాలయం జాతరకు ముస్తాబైంది. 9లో▸



పట్టాల పంపిణీకి 'ఎస్టేట్' అడ్డంకి..!

రామకృష్ణాపూర్ పట్టణంలో సింగరేణి పట్టాల పంపిణీకి ఎస్టేట్ విభాగం అడ్డు పడుతోంది. కొర్రీల కారణంగా రెండు వేల మందికి పట్టాల పంపిణీ నిలిచిపోయింది. 9లో▸

గరిష్టం/కనిష్టం
29.0 /15.0

వాతావరణం

ఆకాశం ప్రకాశవంతంగా ఉంటుంది. వాయువ్యం దిశగా చలిగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి.

రేషన్ గందరగోళం

- తమపేర్లు లేవని ఆందోళన
- అర్హుల జాబితాలో చేర్చాలని వినతులు
- మళ్లీ దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



భీమారంలో వివరాలు సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: కొత్త రేషన్ కార్డుల జారీలో గందరగోళం నెలకొంది. ఈ నెల 20 నుంచి గ్రామసభల్లో అర్హుల జాబితా వెల్లడి చేయనున్న నేపథ్యంలో ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. చాలాచోట్ల తమకు రేషన్ కార్డులు రావడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామాలు, ప ట్టణాల్లో అర్హులైన వారికి కూడా జాబితాలో తమపేర్లు రాలేదని వాపోతున్నారు. మళ్లీ గ్రామాల్లో కార్యదర్శులకు, పట్టణాల్లో మున్సిపల్ అధికారులకు వినతులు ఇస్తున్నారు. అయితే వాటిని ఎప్పుడు పరిశీలించి వీరందరికీ కొత్త కార్డులు జారీ చేస్తారనేదానిపై స్పష్టత లేదు. ప్రజాపాలనలో ఆరు గ్యారంటీల పథకాల అమలు కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఆ సమయంలోనూ తమకు రేషన్ కార్డులు ఇప్పించాలని అనేక మంది అర్జీ పెట్టుకున్నారు. వీటితో పాటు రాష్ట్ర ప్రభుత్వం సామాజిక, ఆర్థిక, కుల గణన సైతం చేపట్టింది. ఆ సమయంలోనూ చాలా మంది తమకు రేషన్ కార్డు లేదని వెల్లడించారు.

కుటుంబ సర్వే ఆధారంగానే..

జిల్లాలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో ఎన్యూమరేటర్లు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించారు. ఆ సమయంలో తమకు రేషన్‌కార్డులు లేవని చెప్పిన వారి వివరాల ప్రకారం జిల్లా వ్యాప్తంగా 18,788 కుటుంబాలు ఉన్నట్లుగా తేలింది. ఈ జాబితా ఆధారంగానే ప్రస్తుతం అర్హుల గుర్తింపు కోసం పరిశీలనలు జరుగుతున్నాయి. అయితే ఇందులో సైతం అర్హులు తగ్గే అవకాశం ఉంది. క్షేత్రస్థాయిలో పరిశీలనలకు వెళ్లినప్పుడు జాబితాలో ఉన్నవారి ఆదాయం, భూవిస్తీర్ణం అధికంగా ఉండడంతో పాటు ఇంట్లో కేంద్ర, రాష్ట్ర, సింగరేణి పరిధిలో ఉద్యోగస్తులు, రిటైర్డ్ ఉద్యోగ పింఛన్‌దారులు ఉన్నారు. వీరందరీ మళ్లీ జాబితా నుంచి తొలగించాల్సి ఉంది. ఇక ప్రభుత్వం పదేళ్ల క్రితం నాటి నిబంధనలే అమలు చేయడంతోనూ సమస్యలు వస్తున్నాయి. కుటుంబ ఆదాయం, ఆస్తులు ఆయా గ్రామాల్లో ఉన్న అధికారులే క్షేత్రస్థాయిలో గుర్తించాల్సి ఉంది. దారిద్ర్యరేఖ (బీపీఎల్)కు దిగువన ఉన్నట్లు గుర్తించిన వారికే రేషన్ కార్డులు అందే అవకాశం ఉంది. దీంతో చాలామంది తమకు రేషన్ కార్డులు వస్తాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు.

అన్నింటికీ ప్రామాణికంగా..

ప్రభుత్వ పథకాల అమలు కోసం రేషన్ కార్డు ప్రామాణికంగా మారడంతో కార్డు పొందాలనే ఆశ అందరిలోనూ ఉంది. ఇటీవల ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికతో పాటు ఇప్పటికే అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీ, గ్యాస్ సబ్సిడీ వంటి వాటికి రేషన్‌కార్డు కీలకంగా మారింది. భవిష్యత్‌లో అమలు చేయనున్న ఇతర సంక్షేమ పథకాలు సైతం రేషన్‌కార్డు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తారనే భావనతో చాలామంది కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. మరోవైపు గత ప్రభుత్వ హయాంలో కొత్త కార్డులు జారీ చేయకపోవడంతో ఏళ్లుగా వేలాది మంది వినతులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ మళ్లీ క్షేత్రస్థాయిలో పరిశీలనలు చేసి మార్పులు, చేర్పులు చేయాల్సి ఉంది.

మార్పులు, చేర్పుల కోసం నిరీక్షణ

ఇక కొత్తగా కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు నమోదు చేసేందుకు అవకాశం లేకుండా పోయింది. అలాగే ప్రస్తుతం ఉన్న కార్డుదారులు విడిపోయి, వేరుపడిన వారికి కొత్త కార్డులు జారీ చేయాలని చాలామంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఇప్పటికీ వారికి కొత్త కార్డుల జారీకి ఆస్కారం లేకపోవడంతో కుటుంబాల వారీగా కార్డుల కోసం ఎదురుచూస్తున్నారు. వీరికి మళ్లీ ఎప్పుడు అవకాశం కల్పిస్తారనే దానిపై అధికారులకు స్పష్టత లేదు. దీంతో రేషన్ కార్డుల కోసం నిరీక్షిస్తున్న చాలామందికి నిరాశే కలుగుతోంది.

పరిశీలనలు జరుగుతున్నాయి

సమగ్ర కుటుంబ సర్వేలో తమకు రేషన్ కార్డులు లేవని తెలిపిన కుటుంబాల జాబితా ప్రకారమే ప్రస్తుతం పరిశీలనలు జరుగుతున్నాయి. క్షేత్రస్థాయిలో అధికారుల పరిశీలన పూర్తయ్యాక అర్హుల పేర్లు గ్రామసభల్లో ప్రకటిస్తారు. కొన్నిచోట్ల అర్హుల జాబితాలో తమపేర్లు లేవని ప్రజల నుంచి వినతులు వస్తున్నాయి. కానీ వీటిపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు.

– బ్రహ్మారావు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

'ఉపాధి' కూలీలకు 'భరోసా'

- జిల్లాలో 15,903 మంది గుర్తింపు
- గ్రామసభల్లో అర్హుల ఎంపిక
- అందనున్న ఇందిరమ్మ ఆత్మీయ భరోసా



పనిస్థలంలో ఉపాధిహామీ కూలీలు (ఫైల్)

పాతమంచిర్యాల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న కూలీలకు తెలంగాణ ప్రభుత్వం తీపికబురు అందించింది. ఉపాధి హామీ పథకంలో కూలీలుగా పనిచేస్తూ భూమిలేని వారికి 'ఇందిరమ్మ ఆత్మీయ భరోసా' పేరుతో రెండు దఫాల్లో ఏడాదికి రూ.12 వేల ఆర్థికసాయం అందించనుంది. మొదటి విడత జనవరిలో రూ.6 వేలు, రెండో విడత జూన్ లేదా జులైలో రూ.6 వేల చొప్పున పంపిణీ చేయనున్నారు. ఈ నెల 26 నుంచే కార్యక్రమం అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఇప్పటికే లబ్ధిదారుల ఎంపిక కోసం ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు ఎంపిక కావాలంటే ఉపాధి హామీలో కూలీలుగా వరుసగా మూడేళ్లుగా క్రమం తప్పకుండా పనులకు హాజరు కావాల్సి ఉంటుంది. 2022 నుంచి 2025 వరకు ఆయా సంవత్సరాల్లో పనులకు హాజరైనట్లు మస్టర్లు నమోదై ఉండాలి. ఏడాదికి కనీసం 20 మస్టర్లు అయినా ఉండాలి. కూలీ పేరుమీద ఎలాంటి భూమి ఉండకూడదు. కుటుంబంలో ఒకరికి మాత్రమే ఈ పథకం ద్వారా రూ.12 వేలు అందుతాయి. జిల్లాలో 1.20 లక్షల జాబ్ కార్డు కలిగిన కుటుంబాలు ఉండగా 2,28,000 మంది కూలీలు ఉన్నారు. అందులో భూమి లేని కూలీలు దాదాపు 15,903 మంది ఉన్నట్లు అధికారులు ధ్రువీకరించారు. ఈ నెల 21 నుంచి నిర్వహించనున్న గ్రామసభలలో లబ్ధిదారుల వివరాలు ప్రకటించనున్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారులు ఉపాధి హామీలో పనిచేస్తున్న కూలీల ఆధార్‌నంబర్లు, పనిచేసిన వివరాలతో నివేదికలు తయారుచేశారు.

మండలాల వారీగా అర్హులు

మండలం	సంఖ్య
బెల్లంపల్లి	1,280
కన్నెపల్లి	535
మందమర్రి	793
దండేపల్లి	1,115
జన్నారం	1,697
భీమారం	886
నెన్నెల	1,059
కాసిపేట	1,206
తాండూర్	1,034
హాజీపూర్	957
కోటపల్లి	1,430
లక్సెట్టిపేట	768
జైపూర్	1,054
చెన్నూర్	1,040
భీమిని	368
వేమనపల్లి	691
మొత్తం	15,903

సంతోషంగా ఉంది



భూమిలేని నిరుపేద కూలీలకు ప్రభుత్వం ఏడాదికి రూ.12 వేలు ఇస్తామని చెప్పడం సంతోషంగా ఉంది. కేవలం కూలి పనులపైనే ఆధారపడి జీవించే మాలాంటి వారికి ప్రభుత్వ అందించే సాయం కుటుంబ పోషణకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– తగురం రాజయ్య, పోలంపల్లి, భీమారం

గ్రామసభల్లో లబ్ధిదారుల ఎంపిక



ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం కూలీల వివరాలను పరిశీలించాం. భూమిలేని నిరుపేద కూలీలకు ఈ పథకం వర్తించే విధంగా వారి జాబ్‌కార్డులు, ఆధార్‌కార్డులు, వారు పనులకు హాజరైన సంవత్సరం, రోజుల వారీగా నివేదికలు తయారు చేశాం.

– ఎస్.కిషన్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి

న్యూస్‌రీల్

ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఈవో

మంచిర్యాలఅర్బన్/లక్సెట్టిపేట: జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతిలో ప్రవేశానికి శనివారం జిల్లాలో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కేంద్రంతోపాటు లక్సెట్టిపేట, చెన్నూర్, మందమర్రి, బెల్లంపల్లి ప్రాంతాల్లో ఏడు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. 1,383 మంది విద్యార్థులకు గానూ 1,090 మంది పరీక్షకు హాజరుకాగా 293 మంది గైర్హాజరయ్యారు. లక్సెట్టిపేటలోని పరీక్ష కేంద్రాలను డీఈవో యాదయ్య తనిఖీ చేశారు. ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్విజిలేటర్ వేణుగోపాల్‌ను విధుల నుంచి తొలగించారు. బంధువుల విద్యార్థి పరీక్ష రాస్తున్న హాలులో ఉన్నాడన్న సమాచారం మేరకు గదిని పరిశీలించి తొలగించినట్లు పేర్కొన్నారు. పరీక్ష కేంద్రంలో తనకు బంధువులెవరూ లేరని వేణుగోపాల్ లిఖితపూర్వకంగా రాసిచ్చినట్లు తెలిపారు. అనంతరం వీకర్స్ కాలనీలో పాఠశాలకు హాజరుకాని విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రతీరోజు పాఠశాలకు వెళ్లాలని సూచించారు.

పరస్పర బదిలీల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు హాజరైన టీచర్లు

మంచిర్యాలఅర్బన్: పరస్పర బదిలీలు 2024 కోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయుల సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీచర్ల నుంచి విల్లింగ్ లెటర్ తీసుకున్నారు. జిల్లాలో విధులు నిర్వహిస్తూ బదిలీకోసం దరఖాస్తు చేసుకున్న 15 మంది టీచర్ల సర్వీస్ బుక్‌లను పరిశీలించారు. ఉపాధ్యాయుల రాకతో విద్యాశాఖ కార్యాలయం సందడిగా మారింది.

అదనపు నిధుల మంజూరుకు కృషి

- చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్



అభివృద్ధి పనులపై సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

చెన్నూర్: చెన్నూర్ మున్సిపాలిటీలో రూ.30 కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, మరింత అభివృద్ధికోసం అదనపు నిధుల మంజూరుకు కృషి చేస్తానని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. స్థానిక మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై శనివారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెన్నూర్ మున్సిపాలిటీలో గత పదేళ్ల నుంచి ఎలాంటి అభివృద్ధి జరగలేదన్నారు. రూ.30కోట్లతో అంతర్గత రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. పెండింగ్ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మున్సిపాలిటీకి ప్రత్యేక నిధులు కేటాయించాలని ప్రిన్సిపల్ సెక్రెటరీని కోరామని, త్వరలోనే నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభిస్తానన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ పాల్గొన్నారు.

'ఎమ్మెల్యే నేతృత్వంలోనే ఇసుక, మట్టి తరలింపు'



గుంతలు చూపిస్తున్న దివాకర్‌రావు

మంచిర్యాలటౌన్: ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు నేతృత్వంలోనే జిల్లా కేంద్రంలోని గోదావరినదిలోంచి ఇసుక, మట్టి అక్రమంగా తరలిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి శనివారం మంచిర్యాలలోని గోదావరి నదిలో మట్టి, ఇసుక కోసం తవ్వగా ఏర్పడిన గుంతలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందలాది లారీల్లో అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తున్నా అధికారులు చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. తవ్వకాలతో ఏర్పడిన గుంతల్లో వర్షాకాలంలో నీరు నిలిస్తే ప్రజలకు ప్రాణాపాయం పొంచి ఉందన్నారు. అక్రమ తవ్వకాలపై అధికారులు వెంటనే స్పందించి, తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నడిపెల్లి విజిత్, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతికత వినియోగంతో చోరీల నివారణ

- రామగుండం సీపీ శ్రీనివాస్



తలుపులకు యాంటీథెఫ్ట్ అలారమ్ లాక్‌వేసి పనితీరును వివరిస్తున్న సీపీ శ్రీనివాస్

మంచిర్యాలక్రైం: చోరీల నివారణకు ప్రజలు సాంకేతికతను వినియోగించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. శనివారం కమిషనరేట్ సమావేశ మందిరంలో చోరీల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నూతనంగా అందుబాటులోకి వచ్చిన యాంటీథెఫ్ట్ అలారమ్ లాక్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం విరివిగా అందుబాటులో ఉందన్నారు. ప్రస్తుతం ప్రజలు చిన్నచిన్న వస్తువుల నుంచి పెద్ద వాటి వరకు ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్స్ డివైస్‌పైనే ఆధార పడి ఉంటున్నారన్నారు. నిత్యం మన జీవన విధానంలో టెక్నాలజీ ఒక భాగమైందన్నారు. చోరీల నివారణకు ప్రతిఒక్కరూ యాంటీథెఫ్ట్ అలారమ్ లాకర్‌ను వినియోగించుకోవాలన్నారు. ఊరికి వెళ్లే ముందు ప్రధాన ముఖద్వార తలుపులు, కిటికీలకు ఈ అలారం బిగిస్తే దొంగలు తలుపులను టచ్ చేయగానే అలారమ్ భారీ శబ్దంతో మోగుతుందన్నారు. దీంతో దొంగలు భయాభ్రాంతులకు గురై పారిపోయే అవకాశం ఉందన్నారు. దీని విలువ సుమారు రూ.300 నుంచి రూ.500 వరకు ఉంటుందని, ఆన్‌లైన్‌లో సైతం దొరుకుతుందన్నారు. అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్ర రావు, సీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ సతీశ్ పాల్గొన్నారు.

ఇక మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్



మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ ప్రతిపాదిత చిత్రం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాల్టీని ప్రభుత్వం కార్పొరేషన్‌గా మార్చింది. అసెంబ్లీ సమావేశాల్లో చేసిన తీర్మానానికి రాష్ట్ర గవర్నర్ ద్వారా తెలంగాణ రాజపత్రం(గెజిట్) విడుదలైంది. ఈ మేరకు ప్రభుత్వ కార్యదర్శి ఆర్.తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. ఇక ప్రభుత్వం అధికారికంగా కార్పొరేషన్ ఏర్పాటుకు సంబంధించిన జీవోను విడుదల చేయాల్సి ఉంది. మంచిర్యాల మున్సిపాలిటీతోపాటు నస్పూరు మున్సిపాలిటీ, హాజీపూర్ మండలం పోచంపాడ్, గుడిపేట, నర్సింగాపూర్, నంనూర్, చందనాపూర్, ముల్కల్ల, కొత్తపల్లి, వేంపల్లి గ్రామాలను కార్పొరేషన్‌లో విలీనం చేయనున్నారు. ఇందుకోసం అధికారులు ఆయా గ్రామాలు, నస్పూర్ మున్సిపాలిటీని కలిపి రూపొందించిన కార్పొరేషన్ ప్రతిపాదిత చిత్రం గత నెలలోనే సిద్ధం చేసి సీడీఎంఏకు పంపించారు. ఈ నెలాఖరుతో మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం ముగుస్తుండగా, గ్రామాల్లో సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీల పదవీకాలం ముగిసింది. కార్పొరేషన్ జీవోను స్థానిక సంస్థల ఎన్నికలకు ముందే విడుదల చేసి, జనాభా ప్రాతిపదికన డివిజన్లుగా మార్చే ప్రక్రియ చేపట్టాలని అధికారులు భావిస్తున్నారు.

షూటింగ్‌లకు దేశంలోనే తెలంగాణ నంబర్ వన్

- తెలుగు ఫిలిం, టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు నాగబాల సురేశ్‌కుమార్



మాట్లాడుతున్న సురేశ్‌కుమార్

చెన్నూర్: సినిమా, టెలివిజన్ షూటింగ్‌లకు దేశంలోనే నంబర్‌వన్ స్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందని తెలుగు ఫిలిం, టెలివిజన్ డెవలప్‌మెంట్ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు, దర్శకుడు, నిర్మాత నాగబాల సురేశ్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో అద్భుతమైన ప్రదేశాలు ఉన్నాయని, ఇక్కడ సినిమా షూటింగ్‌లు నిర్వహించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరామన్నారు. బాలీవుడ్ సినిమా షూటింగ్‌లు సైతం తెలంగాణలో నిర్వహిస్తున్నారన్నారు. నాగబాల అనే టెలివిజన్ సీరియల్‌ను ఆదిలాబాద్ జిల్లాలో షూటింగ్ చేశామని గుర్తు చేశారు. మంచిర్యాల జిల్లాలో సైతం అందమైన ప్రదేశాలు ఉన్నాయన్నారు. చెన్నూర్ నియోజకవర్గంలోని శివ్వారం మొసళ్ల కేంద్రం వద్ద రెండు గుట్టల మధ్య ప్రవహించే గోదావరినది, ఉత్తర దిశగా ప్రవహించే ఉత్తర వాహిని గోదావరి నదులతో పాటు ప్రాణహిత, త్రివేణి సంగమం లాంటి నదులు ఈ ప్రాంతానికి నెలవుగా మారాయన్నారు. రాబోయే రోజుల్లో మంచిర్యాల జిల్లాలో సినిమాలు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో కొమ్మెర రాంమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఇదేం 'చెత్త' పని

- శ్మశాన వాటికలో చెత్త డంపింగ్
- మానవత్వం మరిచిన మున్సిపల్ సిబ్బంది
- కనుమరుగవుతున్న మృతుల జ్ఞాపకాలు
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు



శ్మశాన వాటికలో సమాధుల మధ్య డంప్ చేసిన చెత్త

బెల్లంపల్లి: మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధుల అనాలోచిత విధానాలతో అమరుల స్మారక చిహ్నాల ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. మృతుల జ్ఞాపకార్థం బాధిత కుటుంబ సభ్యులు నిర్మించిన సమాధుల్లోనే చెత్తను డంప్‌చేస్తూ అనాగరికంగా వ్యవహరిస్తున్నారు. మానవత్వం మరిచిపోయి మృతుల కుటుంబ సభ్యుల మనోభావాలను దెబ్బతీస్తున్న అనైతిక చర్యలు బెల్లంపల్లి మున్సిపాలిటీలో యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. దీనిపై పురప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

శ్మశాన వాటికనే డంప్‌యార్డు

ద్వితీయ శ్రేణి బెల్లంపల్లి మున్సిపాలిటీకి డంప్ యార్డు లేకుండా పోయింది. మున్సిపాలిటీ ఏర్పడి 38 ఏళ్లు కావస్తున్నా డంప్‌యార్డు నిర్వహణకు స్థిరమైన చోటు ఎంపిక చేయలేక పోయారు. తొలుత కన్నాలబస్తీ శివారు సర్వేనంబర్ 170లో ఉన్న ప్రభుత్వ భూమిలో డంప్ యార్డు ఏర్పాటు చేసి మూడు దశాబ్దాల పాటు అక్కడే నిర్వహించారు. అయితే ఆ ప్రాంతం ప్రభుత్వం ప్రతిపాదించిన స్పెషల్ ఫుడ్ ప్రాసెసింగ్ జోన్ పరిధిలోకి వెళ్లడంతో అనివార్యంగా అక్కడి నుంచి డంప్‌యార్డును ఎత్తివేశారు. అనంతరం శాంతిఖనికి వెళ్లే మార్గంలో ఉన్న 65 డీప్ ఏరియా కొద్దిరోజుల పాటు చెత్తను పారబోశారు. ఆ ప్రాంత ప్రజల నుంచి తీవ్ర అభ్యంతరం వ్యక్తం కావడంతో ప్రత్యామ్నాయంగా 2 ఇంక్లైన్, గోల్‌బంగ్లాబస్తీ వెనకాల ఉన్న హిందూ శ్మశాన వాటిక ప్రాంతాన్ని ఎంచుకున్నారు. మున్సిపాలిటీలో 34 వార్డులు ఉండగా వీటి పరిధిలో రోజువారీగా 25 మెట్రిక్ టన్నుల వరకు చెత్త సేకరణ జరుగుతోంది. అంతమొత్తంగా జమవుతున్న చెత్తను శ్మశాన వాటికలో డంప్ చేసి సమాధులు కనిపించకుండా చేస్తున్నారు. పండుగలు, పర్వదినాల్లో సమాధి వద్ద దీపాలు వెలిగించి మృతులను స్మరించుకోకుండా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వెదజల్లుతున్న కాలుష్యం

శ్మశాన వాటికలో నిర్వహిస్తున్న డంప్‌యార్డులో పేరుకు పోతున్న చెత్తకు నాలుగైదు రోజులకోసారి నిప్పంటిస్తున్నారు. ఈ కారణంగా చెత్తా చెదారంతో పాటు వ్యర్థాలు, ప్లాస్టిక్ వస్తువులు, తదితర సామగ్రి మంటల్లో కాలిపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. అత్యంత హానికరమైన పొగ వ్యాపిస్తోంది. శ్మశాన వాటికకు ఇరువైపులా గోల్‌బంగ్లాబస్తీ, 2 ఇంక్‌లైన్ బస్తీ, బెల్లంపల్లి బస్తీ, సంక్షేమ గురుకుల విద్యాలయాలు, ఇందిరమ్మ కాలనీలు ఉన్నాయి. చెత్తను కాలబెట్టిన ప్రతీసారి ఆయా ప్రాంతాల ప్రజలు, విద్యార్థులు తీవ్రమైన కంపు వాసన భరిస్తున్నారు. హానికరమైన పొగను పీల్చి శ్వాససంబంధమైన వ్యాధుల బారిన పడుతున్నారు. ప్రజలకు ఇబ్బంది కలిగించడమే కాకుండా శ్మశాన వాటికలో సమాధులు కనిపించకుండా చేస్తున్న డంప్‌యార్డును జిల్లా ఉన్నతాధికారులు సందర్శించి ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. శ్మశాన వాటి క నుంచి డంప్‌యార్డును భేషరతుగా ఎత్తివేయాలని ప్రభావిత ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

ఆందోళనలు చేస్తాం



సమాధులను హిందువులు ఎంతో పవిత్రంగా భావిస్తారు. చనిపోయిన వ్యక్తుల రూపాలను ఆ సమాధిలో చూసుకుని జ్ఞాపకాల్లో జీవిస్తారు. అంతటి ప్రాధాన్యత కలిగిన శ్మశాన వాటికలో చెత్తకుప్పలు బోసి బాధిత కుటుంబ సభ్యుల మనోభావాలను అగౌరవపరుస్తున్నారు. శ్మశాన వాటిక నుంచి డంప్‌యార్డును వెంటనే ఎత్తివేయాలి. లేనిపక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతాం.

– రాచర్ల సంతోష్, బీజేపీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్, బెల్లంపల్లి

ఓటరు దినోత్సవం ఘనంగా నిర్వహించాలి

మంచిర్యాలటౌన్: ఈ నెల 25న ఓటరు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 15వ జాతీయ ఓటరు దినోత్సవంలో భాగంగా 'ఓటు లాంటిది ఇంకొకటి లేదు – నేను కచ్చితంగా ఓటు వేస్తాను' అనే నినాదంతో అర్హత గల ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునేలా వివిధ రకాల కార్యక్రమాల ద్వారా ప్రజలను చైతన్య పరచాలన్నారు. జిల్లాలో ప్రభుత్వ శాఖలు వారి కార్యాలయంలో ఓటరు ప్రతిజ్ఞ చేసి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేపట్టాలన్నారు. నూతనంగా నమోదు చేసుకున్న ఓటర్లను సన్మానించి, గుర్తింపు కార్డులు అందించాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో సౌకర్యాలు, హెల్ప్‌లైన్ యాప్, ఓటు విలువ, తదితర అంశాలపై ప్రజలకు అర్థమయ్యే రీతిలో ప్రాంతీయ భాషలో వీడియోలు రూపొందించి ప్రదర్శించనున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అందరూ కలిసిరావాలన్నారు.

కలెక్టర్‌కు దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందజేస్తున్న కార్యదర్శులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లా పంచాయతీ కార్యదర్శుల ఫోరం ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని 311 మంది పంచాయతీ కార్యదర్శులు వివిధ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకోసం 311 దుప్పట్లను కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీపీవో వెంకటేశ్వర్‌రావు, ఇన్‌చార్జి డీఎల్‌పీవో సఫ్దర్‌అలీ, ఎంపీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీపతి బాపు, ప్రధాన కార్యదర్శి అజ్మత్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణ గడువు పొడిగింపు

మంచిర్యాలటౌన్: పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువును ఫిబ్రవరి 15 వరకు పొడిగించినట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి నీరటి రాజేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రూప్ 1, 2, 3, 4, కేంద్ర ప్రభుత్వ స్టాఫ్ సెలక్షన్, ఆర్ఆర్‌బీ, బ్యాంకింగ్, తదితర పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న మైనార్టీ అభ్యర్థులకు అనుభవజ్ఞులైన శిక్షకులతో 4 నెలలపాటు ఉచిత ఫౌండేషన్ శిక్షణ అందించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీకులు) తమ దరఖాస్తుతో అవసరమైన ధృవపత్రాలు జతపరిచి ఫిబ్రవరి 15లోగా నస్పూర్‌లో గల సమీకృత కలెక్టరేట్ భవన సముదాయంలో గల శాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 9705912145 నంబర్‌లో సంప్రదించాలని, ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక



ఎంపికైన రశ్మితతో హెచ్‌ఎం హన్మాండ్లు, పీఈటీ శ్రీనివాస్

మంచిర్యాలరూరల్(హాజీపూర్): ఖేలో ఇండియా అండర్–17 బాలికల రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు హాజీపూర్ మండలం దొనబండ జెడ్పీ ఉన్నత పాఠశాల 9వ తరగతి విద్యార్థిని జి.రశ్మిత ఎంపికైంది. గత నెల 21న మంచిర్యాల జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జరిగిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో రశ్మిత ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం హన్మాండ్లు, పీఈటీ శ్రీనివాస్ తెలిపారు. సిద్దిపేట జిల్లా వర్గల్‌లో ఈనెల 18 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఆమె పాల్గొంటుందని వివరించారు.

రైతు ఉత్పత్తి సంఘాలకు ఉజ్వల భవిష్యత్తు

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



సభ్యులకు చెక్కులు అందజేస్తున్న ఐటీడీఏ పీవో

ఉట్నూర్‌రూరల్: అన్నదాతలు ఆర్థికంగా అభివృద్ధి చెందడానికి రైతు ఉత్పత్తి సంఘాలు దోహదపడతాయని, వీటికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ట్రికార్ ద్వారా చెక్కులను శనివారం సంఘాల సభ్యులకు అందజేశారు. ట్రికార్ ద్వారా ఆసిఫాబాద్ జిల్లా జైనూర్, రెబ్బెన మండలాల రైతు ఉత్పత్తి సంఘాలకు రాయితీపై ఒక్కో రైతు ఉత్పత్తి సంఘానికి రూ.7.50 లక్షల చొప్పున మొత్తం రూ.15 లక్షల చెక్కులను సభ్యులకు అందించారు. ప్రాజెక్టు ఉద్యాన అధికారి గుడిమల్ల సందీప్‌కుమార్, సెర్ప్ అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ సుజాత, రైతు ఉత్పత్తి సంఘాల సభ్యులు వినోద్, ప్రశాంత్, ప్రజ్ఞశీల్, బోర్డు డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

కారడవిలో.. కొండలరాయుని చరిత్ర

- దట్టమైన అడవిలో నిట్టనిలువుగా కొండ
- చుట్టూ రాతి కంచె..
- వెలుగులోకి తెచ్చిన చరిత్రకారుల బృందం
- ఆర్కియాలజీ, పురావస్తు శాఖలు చొరవ చూపితే పర్యాటక శోభ



కొండల రాయుని గుట్టను చూపుతున్న కరిపె రాజ్‌కుమార్

ఖానాపూర్: దట్టమైన అడవులకు నిలయంగా ఉన్న ఖానాపూర్ ప్రాంతానికి ఘనమైన చరిత్ర ఉన్నప్పటికీ కోటను కాపాడి చరిత్రను వెలుగులోకి తెచ్చే వారు లేరు. దీంతో చరిత్ర మరుగున పడే అవకాశం ఉంది. నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం తర్లపాడ్, ఎక్బాల్‌పూర్, సింగాపూర్ గ్రామాల మధ్యలోని దట్టమైన అటవీప్రాంతంలో నిట్టనిలువుగా ఉన్న ఒక పెద్ద గుట్టపైన కొండల రాయుని కోట శిథిలాలు ఉన్నాయి. గుట్ట కింది భాగం నుంచి శిఖరాగ్రం వరకు సుమారు కిలోమీటరు పైనే ఉంటుందని చరిత్రకారులు బృందం సభ్యులు కరిపె రాజ్‌కుమార్, కరిపె రాజశేఖర్, గోండు మధు, చాకలి హన్మంతు తెలిపారు. ఇటీవల అత్యంత శ్రమకోర్చి శిథిల రాతి కంచెను గుర్తించారు. సుమారు పదెకరాల విస్తీర్ణంలో కొండ వ్యాపించి ఉంది. కోటకు మొదట్లో ద్వారపు ఆనవాళ్లు ఉన్నాయి. ఈ దారి వెంబడి పైకి వెళ్తున్న కొద్దీ పెద్ద పెద్ద బేటురాళ్లు అక్కడక్కడ దర్శనమిస్తాయి. ఎత్తైన ప్రదేశాల్లో అంతస్తుల తరహాలో రాళ్లతో పటిష్టంగా నిర్మించిన బురుజులు ఉన్నాయి. ప్రతీ వందమీటర్ల ఎత్తుకు వెళ్లే కొద్దీ ఒక్కో దిక్కులో అనేక బురుజులు కనిపిస్తాయి.

సమాధిలాంటి రాతి నిర్మాణాలు

శిఖరాగ్రంలోని ఆగ్నేయ దిక్కులో ఒక పెద్ద సమాధి లాంటి రాతి నిర్మాణం సుమారు 20 అడుగుల ఎత్తులో నిర్మించి ఉంది. ఈ రాతి నిర్మాణం శిథిల



గుట్టపై లభించిన కాల్చిన ఇటుక

మైనప్పటికీ దీనినే కొండల రాయుడి సమాధిగా చరిత్రకారులు భావిస్తున్నారు. దిగువన పడమటి దిక్కున సైతం కొంచెం చిన్నదిగా అలాంటి మరో నిర్మాణం ఉంది. దీన్ని రాణి సమాధిగా ప్రజలు భావిస్తున్నారు. చుట్టూ కొలత దాదాపు 8 కిలోమీటర్లకు పైగా ఉంది. రాతి కంచె ఎక్కడా



గుట్టపై లభించిన ఇనుప చిట్టెంలు

కూడా శిథిలం కాలేదు. ఈ మార్గం వెంబడి లోహ పరిశ్రమకు చెందిన ఇనుప చిట్టెంలు, కాల్చిన ఇటుకలు కూడా గుర్తించారు.

ఆర్కియాలజీ, పురావస్తు శాఖ చొరవ చూపాలి

బలుమూరి కొండయ్య 1690–1720 నిజామాబాద్ జిల్లాలోని భీమ్‌గల్ జాగీరు కోసం గోల్కొండ పాలకులతో యుద్ధానికి దిగినట్లు చరిత్ర ఉందని చరిత్రకారులు చెబుతున్నారు. అపజయాన్ని శంకించి భీమ్‌గల్‌లోని పల్లికొండ దగ్గర బాచనపల్లి చిన్నోల్ల గుట్ట మీద ఆత్మహుతి చేసుకున్న కొండల రాయుడి దేహాన్ని ఆయన అనుచరులు కామారెడ్డి దగ్గరలోని వెల్లుల్లపేటలో సమాధి చేశారని మరో కథ ప్రచారంలో ఉంది. వీటన్నింటినీ మరిన్ని వివరాలతో వెలుగులోకి వచ్చేలా పురావస్తు, ఆర్కియాలజీ శాఖలు చొరవ చూపితే ఈ ప్రాంతం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందని చరిత్రకారులు పేర్కొంటున్నారు.

కాకులు దూరని కారడవి..

కాకులు దూరని కారడవిలా ఉన్న ఈ ప్రాంతంలో బహుశా కత్తుల తయారీ జరిగి ఉండే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు. కొండల రాయుడు గుర్రంపైన చాలా వేగంగా ప్రయాణించేవాడని, ఈ ప్రాంత ప్రజలందరికీ ఆరాధ్యుడనే విషయం బొబ్బిలి కథకుల ద్వారా తెలుస్తోంది. కొడుకా..కొండల రాయుడా.. అనే మకుటంతో ఒక స్మృతి గీతం అప్పుడప్పుడు ప్రజల నోళ్లలో ఇప్పటికీ నానుతూనే ఉంది.

చరిత్ర వెలుగులోకి తేవాలి

కొండల రాయుని గురించి ప్రజలు పాడుకున్న జానపద గీతం, బిరుదు తదితర సమాచారం, చరిత్ర పుటల్లోంచి నేటి సమాజానికి తెలిసి వచ్చేలా పురావస్తు శాఖ, ఆర్కియాలజీ శాఖలు, ప్రభుత్వాలు దృష్టిసారించాలి. ప్రముఖ చరిత్ర పరిశోధన బృందంతో కలిసి సమష్టిగా వెలుగులోకి తేవాల్సిన అవసరం ఉంది. తద్వారా భవిష్యత్ తరాలకు గత చరిత్రలు తెలియవస్తాయి.

– కరిపె రాజ్‌కుమార్, ప్రముఖ చరిత్ర పరిశోధకుడు

ఉదారత చాటిన తోటి కానిస్టేబుళ్లు

- మృతుడి కానిస్టేబుల్ కుటుంబానికి రూ.2లక్షల ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న కానిస్టేబుళ్లు

ఆదిలాబాద్‌టౌన్: తోటి కానిస్టేబుల్ మృతిచెందడంతో కానిస్టేబుళ్లు ఉదారత చాటారు. తమవంతుగా ఆర్థికంగా ఆదుకునేందుకు ముందుకొచ్చారు. 2004 ఏఆర్ బ్యాచ్‌కు చెందిన పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అక్బర్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబీకులకు ఉమ్మడి జిల్లా సివిల్, ఏఆర్ కానిస్టేబుళ్లు శనివారం రూ.2 లక్షల ఆర్థికసాయం అందజేశారు. మృతుడి భార్య, పిల్లలకు రూ.1.50 లక్షలు, అక్బర్ తల్లిదండ్రులకు రూ.50 వేల నగదు అందించారు. ఆర్‌ఐ డి.వెంకట్, కానిస్టేబుళ్లు కిశోర్, ప్రవీణ్, అజయ్, రాందాస్, ప్రకాశ్, విజయ్, రాజేశ్వర్, ధనరాజ్, సతీశ్, కైలాస్ పాల్గొన్నారు.

హాజీపూర్‌లో అటవీ ప్రాంతాల సందర్శన



గఢ్‌పూర్ అటవీ ప్రాంతంలో ప్రకృతి ప్రేమికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలంలోని అటవీ ప్రాంతాలను ప్రకృతి ప్రేమికులు శనివారం సందర్శించారు. చిన్నగోపాల్‌పూర్, గఢ్‌పూర్, ర్యాలీ, నాగారం గ్రామాల పరిధిలోని అటవీ ప్రాంతాల్లో అటవీ జంతువులను వీక్షించారు. స్వీడన్, లండన్ నుంచి విచ్చేసిన సంగీత కళాకారులతోపాటు కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ప్రకృతి ప్రేమికులు ఉన్నారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు ప్రమాదవశాత్తు వాగులో పడి మృతిచెందాడు. జైనథ్ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. జైనథ్ ఎస్సై పురుషోత్తం కథనం ప్రకారం.. మండలంలోని రామాయి గ్రామానికి చెందిన టాప్రే అనిల్ (39) చేపల వేట కోసం శుక్రవారం సాయంత్రం పార్డి(కె), రామాయి గ్రామాల సమీపంలోని సాత్నాల వాగు వద్దకు వెళ్లాడు. చేపల కోసం వేసిన వలలో చిక్కుకుని పార్డి(కె) సమీపంలోని వాగులో పడి మృతిచెందాడు. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు ఆయన కోసం వెతికిన ఆచూకీ దొరకలేదు. శనివారం ఉదయం వాగులో శవమై తేలాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఉరేసుకుని రిటైర్డ్ కార్మికుడు ఆత్మహత్య



భీమరాజు (ఫైల్)

రామకృష్ణాపూర్: పట్టణంలోని జవహర్‌నగర్ కాలనీకి చెందిన సింగరేణి రిటైర్డ్ కార్మికుడు కడమంచి భీమరాజు (70) శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై రాజశేఖర్ కథనం ప్రకారం..భీమరాజు గత కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నాడు. తన భార్య కొన్నాళ్ల క్రితం చనిపోవడంతో ఒంటరిగా ఉంటున్నాడు. అటు ఆరోగ్యం సరిగా లేకపోవడంతో మానసికంగా కలత చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్సై తెలిపారు.

పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

- ఆపస్మారక స్థితిలో పడిపోగా గమనించిన సిబ్బంది
- బైక్‌పై ఆసుపత్రికి తరలింపు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మేజర్ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడ కాలనీకి చెందిన సెండె సంతోష్ శనివారం పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఆపస్మారక స్థితిలో దారిలో పడిపోయాడు. తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తున్న రికార్డు అసిస్టెంట్ షేక్ ఖాదర్, అటెండర్ మల్లేశ్‌లు ఇటిక్యాల పహాడ్ గ్రామంలో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వెళ్లివస్తుండగా మార్గమధ్యలో సంతోష్‌ను గమనించారు. బైక్‌పై సిర్పూర్(టి) ప్రభుత్వ సామాజిక ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడారు. మెరుగైన వైద్యం కోసం కాగజ్‌నగర్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు.

అక్రమంగా నిల్వ చేసిన ఇసుక సీజ్



ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న తహసీల్దార్

తాంసి: భీంపూర్ మండలం గుబిడి శివారులో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ నలందప్రియ తెలిపారు. గుబిడి శివారులోని పెన్‌గంగ నది వెంట శనివారం సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఇసుక తవ్వకాలు చేపట్టిన ప్రదేశాలను పరిశీలించారు. పెన్‌గంగ నది ఒడ్డున పంట చేలలో పక్కన అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంప్‌లను గుర్తించారు. 11 చోట్ల నిల్వ చేసిన డంప్‌ల్లో 25 ట్రాక్టర్ల మేర నిల్వ ఉన్న ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. వీటి విలువ దాదాపు రూ.60 వేలు ఉంటుందని పేర్కొన్నారు. పెన్‌గంగ నదిలో అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపడితే చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్‌ఐ రాందాస్, సిబ్బంది ఉన్నారు.

జెడ్పీహెచ్‌ఎస్‌లో కంప్యూటర్ల చోరీ

- ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన



కంప్యూటర్ ల్యాబ్‌ను పరిశీలిస్తున్న సీఐ సైదారావు

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ జెడ్పీహెచ్‌ఎస్‌లో మూడు కంప్యూటర్లు చోరీ జరిగింది. ఈ ఘటన శనివారం ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల పాఠశాలకు సంక్రాంతి సెలవులు ఇవ్వడంతో ఇదే అదునుగా భావించిన దొంగలు చొరబడి కంప్యూటర్ ల్యాబ్ తాళం పగులగొట్టారు. రూ.54 వేల విలువ గల మూడు కంప్యూటర్లకు సంబంధించిన సీపీయూలు, మానిటర్లు, యూపీఎస్‌లు, కీబోర్డు, మౌస్‌లు ఎత్తుకెళ్లారని హెచ్‌ఎం నరేందర్‌రావు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. చోరీ ఘటన విషయం తెలియడంతో సీఐ సైదారావు ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. అంతకుముందు క్లూస్‌టీం సిబ్బందితో విచారణ చేపట్టారు.

గంగాజలంతో ఉట్నూర్‌కు మెస్రం వంశీయులు



ఉట్నూర్‌కు చేరుకున్న మెస్రం వంశీయులు

ఉట్నూర్‌రూరల్: కేస్లాపూర్‌లో నిర్వహించే నాగోబా జాతరకు మెస్రం వంశీయులు కాలినడకన జన్నారం మండలం కలమడుగు గోదావరి నదికి చేరుకున్నారు. గంగాజలం తీసుకుని తిరుగుపయనంలో శనివారం ఉట్నూర్‌లోని గోండుగూడకు చేరుకున్నారు. మాజీ ఎంపీపీ జైవంత్‌రావు, యువ నాయకుడు జయచంద్ర స్వాగతం పలికారు. వారు కొంతసేపు సేద తీరారు. రాత్రి ఉట్నూర్‌లో బస చేసి ఆదివారం ఉదయం ఇంద్రవెల్లికి బయల్దేరనున్నారు. ఆలయ చైర్మన్ కోసేరావు పటేల్ ఉన్నారు.

సింగరేణి కుట్రలను తిప్పికొట్టిన ఎస్టీపీపీ కార్మికులు

- హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్
- టోకెన్ సమ్మె విజయవంతం



నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, హెచ్‌ఎంఎస్ నాయకులు

జైపూర్: సింగరేణి అధికారుల కుట్రలను తిప్పకొడుతూ ఎస్టీపీపీలో కాంట్రాక్టు కార్మికులు స్వచ్ఛందంగా విధులు బహిష్కరించి టోకెన్ సమ్మెను విజయవంతం చేశారని హెచ్‌ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ తెలిపారు. జైపూర్ ఎస్టీపీపీ భూనిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులకు ఎన్టీపీసీలో చెల్లిస్తున్న మాదిరిగా వేతనాలతోపాటు డస్టు, రిస్క్, నైట్ డ్యూటీ అలవెన్సులు రూ.5 వేలు చెల్లించడంతోపాటు కనీస సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ హెచ్‌ఎంఎస్ ఆధ్వర్యంలో శనివారం ఒకరోజు టోకెన్ సమ్మె చేపట్టారు. సుమారు వెయ్యిమందికి పైగా కార్మికులు పాల్గొని ఎస్టీపీపీ ప్రధాన గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడారు. 2009 భూసేకరణ సమయంలో అధికారులు భూ నిర్వాసితులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇస్తామని చెప్పి కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధి కల్పించి ఏళ్లు గడుస్తోందన్నారు. ప్రతి నాలుగేళ్లకోసారి పదోన్నతి కల్పిస్తూ సెమిస్కిల్డ్, స్కిల్డ్ వేతనాలు చెల్లించాలన్నారు. ప్రభావిత గ్రామాల్లో కాకుండా సీఎస్ఆర్ నిధులను మంత్రుల ఇళ్లల్లో సామగ్రికి, ఇతర ప్రాంతాల్లో ఖర్చు చేస్తోందన్నారు. కార్మిక సమస్యలపై హైదరాబాద్‌లో డిప్యూటీ లేబర్ కమిషన్ ఆధ్వర్యంలో 22 సార్లు చర్చల్లో పాల్గొన్న యాజమాన్యం పట్టించుకోకపోవడంతో సమ్మె చేపట్టినట్లు తెలిపారు. వారి సమస్యలు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. కాగా, రాత్రి వరకు కార్మికులు నిరసన వ్యక్తం చేయగా, ఎలాంటి గొడవలు జరగకుండా శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, స్థానిక ఎస్సై శ్రీధర్, సీఐఎస్ఎఫ్, పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. హెచ్‌ఎంఎస్ ఉపాధ్యక్షుడు సారయ్య, ఎస్టీపీపీ జనరల్ సెక్రెటరీ విక్రమ్, ఉపాధ్యక్షులు చిప్పకుర్తి సంపత్, సాయికృష్ణారెడ్డి, నాయకులు నర్సింహారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

'సమ్మె ప్రభావం లేదు'

ఎస్టీపీపీలో టోకెన్ సమ్మె ప్రభావం లేదని ఈడీ రాజశేఖర్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉత్పత్తి, బొగ్గు సరఫరా, ఫ్లైయాష్, బాటమ్ యాష్ సరఫరా యథావిధిగానే జరిగిందని పేర్కొన్నారు. సీఎండీ బలరాం చొరవతో కాంట్రాక్టు కార్మికులకు లాభాల వాటా కింద గత సంవత్సరం రూ.5 వేలు చెల్లించామని తెలిపారు.

నాటుసారా స్థావరంపై దాడులు



బెల్లం పానకం స్వాధీనం చేసుకున్న పోలీసులు

బెజ్జూర్: మండలంలోని లంబాడిగూడ, సలుగుపల్లి, రెబ్బెన గ్రామాల్లోని నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం దాడులు నిర్వహించారు. 40 లీటర్ల నాటుసారా, 800 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసి 14 మందిపై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. నాటుసారా తయారీ చేస్తున్న వారిని తహసీల్దార్ భూమేశ్వర్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఈ దాడుల్లో ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఎక్సైజ్ ఎస్సైలు లోబానంద్, సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

పటిక, బెల్లం పట్టివేత

దండేపల్లి: లక్సెట్టిపేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని దండేపల్లి మండలం లింగాపూర్, మేదరిపేటలో శనివారం నిర్వహించిన తనిఖీల్లో ప టిక, బెల్లంతోపాటు గుడుంబా పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ సమ్మయ్య తెలిపారు. లింగాపూర్‌లో బోడ పంచిబాయి వద్ద 2 లీటర్ల గుడుంబా, మేదరిపేటలోని గోలి రమేశ్ కిరాణా షా పులో 95 కిలోల బెల్లం, 10 కిలోల పటికను ప ట్టుకున్నట్లు పేర్కొన్నారు. ఈమేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

దాడికి పాల్పడిన ఇద్దరు అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలోని చేపల మార్కెట్‌లో ఈనెల 15న బీజేపీ నాయకుడు మిట్టపల్లి జయరామారావుపై దాడికి పాల్పడిన ఇద్దరిని శనివారం అరెస్టు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. చేపల మార్కెట్‌లో జయరామారావు చేపలు కొనుగోలు చేస్తుండగా అకారణంగా సంజీవ్, సాయితేజలు అతనిపై దాడి చేశారు. ఆయన భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్సై రాజవర్ధన్

జన్నారం: బైక్‌పై గంజాయి తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు. జన్నారం పోలీసుస్టేషన్ ఈ మేరకు వివరాలు వెల్లడించారు. పక్కా సమాచారంతో మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం సమీపంలో పోలీసులు శనివారం సాయంత్రం వాహనాలు తనిఖీలు చేపట్టారు. బైక్‌పై వస్తున్న మహ్మదబాద్‌కు చెందిన కామెర నగేశ్, బెంబడి పవన్‌ను తనిఖీ చేయగా వారి వద్ద 30 గ్రాముల గంజాయి లభించింది. ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా గంజాయి విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు.

గంజాయి విక్రయిస్తున్న ఒకరు రిమాండ్

కాగజ్‌నగర్‌రూరల్: గంజాయి విక్రయిస్తున్న ఒకరిని శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఈజ్‌గాం ఎస్సై మహేందర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని నజ్రూల్‌నగర్ విలేజ్ నెంబరు 12 గ్రామానికి చెందిన యువకుడు ఉజ్వల్ భక్షి గంజాయి విక్రయిస్తూ పట్టుబడ్డాడు. అతని వద్ద లభ్యమైన 400 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.

దైవ దర్శనానికి వచ్చి..కానరాని లోకాలకు

- ఇందాపూర్ వాగు దాటుతుండగా నీట మునిగిన వ్యక్తి
- మృతుడు మహారాష్ట్ర వాసి



పంచనామా నిర్వహిస్తున్న ఎస్సై విజయ్

కెరమెరి(ఆసిఫాబాద్): దైవదర్శనానికి వచ్చి ఒకరు కానరాని లోకాలకు వెళ్లిపోయాడు. మండలంలోని ఇందాపూర్ వాగు దాటుతుండగా ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతిచెందాడు. ఇందాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. కెరమెరి ఎస్సై విజయ్ కథనం ప్రకారం.. మహారాష్ట్రలోని దేవాడ గ్రామానికి చెందిన కోట్నాక మారు (30) ఈనెల 16న ఇందాపూర్ సమీపంలో పోతురాజు, ధర్మరాజు జాతరకు వచ్చాడు. 17 వరకు ఇంటికి తిరిగి వెళ్లలేదు. దీంతో తండ్రి దౌలత్‌రావు బంధువుల వద్ద వాకబు చేయగా కుమారుడు ఆచూకీ దొరకలేదు. అదేరోజు కెరమెరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో ఇందాపూర్ వాగులో మృతదేహం కనిపించినట్లు పలువురు పోలీసులకు సమాచారం అందించారు. శనివారం వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడు కోట్నాక మారుదని గుర్తించారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గాయపడిన యువకుడు మృతి



రాజేందర్(ఫైల్)

నెన్నెల: మండలంలోని జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్(26) చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. జెండావెంకటాపూర్ గ్రామానికి చెందిన ఏస్కూరి రాజేందర్, దుర్గం శంకర్ సిరిసిల్ల జిల్లా వేములవాడ శివారులో రైతు నవీన్ మామిడితోటలో పని చేస్తున్నారు. ఈ నెల 14న వేకువజామున రాజేందర్, శంకర్ వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవాలయానికి దర్శనం కోసం వెళ్లారు. భగవంత్‌రావునగర్‌లో గంజాయి మత్తులో ఉన్న ఐదుగురు యువకులు వీరిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గాయపడిన వారిని పోలీసులు ఆస్పత్రికి తరలించారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి కేసు నమోదు చేశారు. చికిత్స పొందుతూ రాజేందర్ మృతిచెందాడు. మృతదేహాన్ని శనివారం రాత్రి కుటుంబ సభ్యులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. కాగా, శంకర్ కోలుకున్నాడు.